నేడు బీఆర్ఎస్ బీసీ సదస్సు

వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

కులగణన వ్యూహాత్మక కుట్ర

తెలంగాణలో బీసీలను కాంగ్రెస్ చారిత్రక మోసం చేసింది. నవంబర్‌లో 50 రోజుల పాటు ప్రభుత్వం చేపట్టిన కులగణన తెలంగాణ దళిత, బహుజన సమాజాన్ని తీవ్ర విస్మయానికి గురిచేసింది. అసెంబ్లీలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన నివేదిక పారదర్శకంగా లేదని యావత్ బీసీ సమాజం మూకుమ్మడిగా వ్యతిరేకించింది. జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్ల పెంపుతోపాటు, సంపద వికేంద్రీకరణ జరగాలనేది కులగణన లక్ష్యం. అయితే, ప్రభుత్వం మాత్రం దీనిని చాలా తేలిగ్గా తీసుకుందని నివేదిక చూస్తే అర్థమవుతుంది. సర్వేను ఇటు అధికారులు కానీ, అటు ప్రభుత్వం కానీ సీరియస్‌గా తీసుకోలేదు. కేసీఆర్ హయాంలో చేపట్టిన సమగ్ర సర్వే బోగస్ అని కొట్టిపడేస్తున్న రేవంత్ ప్రభుత్వం మళ్లీ అదే సర్వేతో తమ సర్వేను పోల్చుకోవడం గమనార్హం. కేసీఆర్ హయాంలో ఓసీ జనాభా 21 శాతం ఉంటే తమ సర్వేలో 15 శాతమే తేలారని చెప్తున్నారు. అంటే సమగ్ర సర్వేను అంగీకరిస్తున్నట్టే కదా.

రాష్ట్రంలో పదేండ్ల కాలంలో బీసీ జనాభాను తగ్గించి చూపించడాన్ని బీసీ సహా ఏ ఇతర సమాజం కూడా స్వాగతించడం లేదు. దీనినిబట్టి ఆ నివేదికలో పారదర్శకత ఎంతో అర్థం చేసుకోవచ్చు. 2001లో 3,09,87,271 ఉన్న తెలంగాణ జనాభా 2011 నాటికి 3,50,03,674 పెరిగింది. అంటే 13.58 శాతం. కులగణనను కాసేపు పక్కన పెడితే ఈ లెక్కల ప్రాతిపదికనైనా ఈ 13 ఏండ్ల కాలంలో కనీసం 60 లక్షల జనాభా అయినా పెరగాలి. కానీ, ప్రభుత్వం 3,54,77,554గా చూపిస్తున్నది. ఈ లెక్కల తీరు చూస్తుంటే ఈ నివేదిక తప్పుల తడక కానే కాదు, ఇది వ్యూహాత్మకంగా చేసిన కుట్రలో భాగంగానే మేధావులు భావిస్తున్నారు. పదేండ్ల కాలంలో తెలంగాణలో బీసీ జనాభా పెరగలేదనడం కాంగ్రెస్ ఆధిపత్య వర్గాల పకడ్బందీ ప్రణాళికలో భాగమే. బీసీ జనాభాను ఉన్నది ఉన్నట్టుగా చూపిస్తే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఎక్కడ మాట్లాడతారోననే దురుద్దేశంతోనే ఈ కుట్రకు తెరలేపారు. శాస్త్రీయత లేని కులగణన నివేదికను తెలంగాణ బీసీ సమాజం వ్యతిరేకిస్తున్నది. ఆ లెక్కలను చూస్తే కులగణన రూపం ఒకటి, సారం మరొకటిగా తేటతెల్లమైంది. కేసీఆర్ ఒక్క రోజులో సమగ్ర సర్వే చేస్తే రాని విమర్శ కాంగ్రెస్ 50 రోజుల సర్వేలో వచ్చింది. కాంగ్రెస్ పార్టీ తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలంటే గ్రామాల వారీగా, వార్డుల వారీగా, మండలాల వారీగా, జిల్లాల వారీగా యూనిట్‌గా తీసుకొని ఆయా కులాల జనాభాను ప్రకటించాలని బీసీ సమాజం డిమాండ్ చేస్తున్నది. లేదంటే పకడ్బందీగా రీసర్వే చేసి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాల్సి ఉంటుంది. లేదంటే భవిష్యత్తులో వెనుకబడిన కులాలకు రాజకీయ, విద్య, ఉద్యోగ, సంక్షేమ, సామాజిక రంగాల్లో తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉన్నది.

-డాక్టర్ బక్కతట్ల వెంకటేష్ యాదవ్, 97054 88333

అన్యాయంపై అభ్యంతరాలు

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టి కులగణన సర్వేలో బలహీన వర్గాల జనాభాని తగ్గించి చూపడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. నివేదిక విషయంలో బలహీన వర్గాల నుంచి వస్తున్న సందేహాలను నివృత్తి చేయాల్సిన ప్రభుత్వం మొండి వాదనతో సున్నితమై అంశానికి రాజకీయ రంగు పులిమే ప్రయత్నం చేస్తుండటం సిగ్గుచేటు. పైపెచ్చు కులగణన చరిత్రాత్మకమని చెప్పడం ప్రజలను తప్పుదారి పట్టించడమే అవుతుంది. బలహీనవర్గాలు కులగణనని ప్రశ్నించడం లేదు. కానీ, కులగణన రిపోర్టులో బీసీలకు నష్టం చేస్తున్న అంశాలపై అభ్యంతరాలు లేవనెత్తుతున్నారనే విషయాన్ని ప్రభుత్వం విస్మరిస్తున్నది.

2015లో నాటి బీఆర్ఎస్ సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం రాష్ట్రంలో బీసీలు 51.1 శాతంగా ఉంటే కులగణన సర్వేలో మాత్రం 46.25 శాతానికి ఎలా తగ్గారు? సమగ్ర కుటుంబ సర్వేలో బీసీలు 1.88 కోట్లుగా ఉంటే ప్రస్తుత సర్వేలో మాత్రం 1.64 కోట్లుగా చూపిస్తున్నారు. అంటే 24 లక్షల జనాభా ఏమైనట్టు? సమగ్ర కుటుంబ సర్వేలో అగ్రవర్ణాలను 21 శాతంగా చూపిస్తే, కులగణన సర్వేలో 28.35 శాతంగా అంటే 7 శాతం ఎక్కువగా చూపించడంతో బీసీల జనాభా శాతం తగ్గిపోయింది. 2011 జనాభా లెక్కల ప్రకారంగా రాష్ట్ర జనాభా 3.51 కోట్లుగా ఉంటే వార్షిక వృద్ధి రేటు 1.3 శాతంగా ఉన్నది. ఈ లెక్కన రాష్ట్రంలో ఏడాదికి 1.3 శాతం చొప్పున జనాభా పెరిగితే అడ్వాన్స్‌డ్ ఎస్టిమేట్స్ ప్రకారం రాష్ట్ర జనాభా 4.2 కోట్లుగా ఉండాలి. కానీ, కులగణన రిపోర్టులో 3.54 కోట్లుగా పేర్కొన్నారు. అంటే, 60 నుంచి 70 లక్షల జనాభా సర్వే పరిధిలోకి రాలేదు. రాష్ట్రంలో 1.17 కోట్ల కుటుంబాలు ఉంటే సర్వే పరిధిలోకి మాత్రం కేవలం 1.12 కోట్ల కుటుంబాలు వచ్చాయి. కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రకారం రాష్ట్రంలో 3.35 కోట్ల ఓటర్లు ఉంటే, కుల గణన రిపోర్టు ప్రకారం రాష్ట్ర జనాభా 3.54 కోట్లుగా చూపిస్తున్నారు. అంటే ఓటర్లుగా నమోదు కాని వారు రాష్ట్రంలో 19 లక్షలేనా? అందుకే సర్వే రిపోర్ట్ అశాస్త్రీయంగా ఉందనే భావన వ్యక్తం అవుతున్నది. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల అమలుకు భవిష్యత్తులో అడ్డంకులు ఎదురు కావద్దనే రిపోర్టులో అగ్రవర్ణాల జనాభా శాతాన్ని 15.79 శాతంగా చూపించి, బీసీల జనాభా శాతాన్ని 46 శాతానికి తగ్గించారనే అనుమానాలు కలగక మానవు. బీసీలు, మైనార్టీ, బలహీన వర్గాలు కలిపి 61 శాతానికి పైగా ఉండాలి. కానీ, నివేదికలో వారి జనాభా శాతాన్ని 56.33 శాతానికి పరిమితం చేయడం వెనక కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

-డాక్టర్ తిరునహరి శేషు, 98854 65877

బలపడుతున్న ప్రజా పోరు

అసెంబ్లీ ఎన్నికల్లో పరాభవం తర్వాత బీఆర్ఎస్ పలు సవాళ్లను ఎదుర్కొన్నది. పార్టీ నేతల ఫిరాయింపులు, కీలక నేతలపై వేధింపులు, పార్టీ అధినేత కేసీఆర్‌కు గాయం వంటి ఎన్నో సమస్యలు ఎదురైనా నడుంబిగించి పోరాట పంథాను కొనసాగిస్తున్నది. తెలంగాణ హక్కులకు విరుద్ధంగా కృష్ణా జలాలను అక్రమంగా తరలిస్తున్న అంశంపై బీఆర్ఎస్ గట్టిగా ప్రశ్నించడంతో అసెంబ్లీ సాక్షిగా కాంగ్రెస్ వెనక్కి తగ్గాల్సి వచ్చింది. ఇది బీఆర్ఎస్ సాధించిన విజయం. 6 గ్యారెంటీల (420 హామీలు) అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ఈ విషయంలో ప్రభుత్వ అసమర్థతను ప్రజలకు వివరించి చెప్పడంలో బీఆర్ఎస్ విజయం సాధించింది. ఇది ఆ పార్టీకి ప్రజాదరణను మరింత పెంచింది. 'హైడ్రా' పేరుతో పేదల గుడిసెలు కూల్చడాన్ని బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకించింది. మూసీనది పరీవాహక ప్రాంత ప్రజలకు అండగా నిలిచి వారికి భరోసా కల్పించింది. దామగుండం అటవీ ప్రాంతంలో ప్రతిపాదిత రాడార్ సంస్థ ఏర్పాటు నిర్ణయాన్ని బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకించింది. లగచర్ల గిరిజనులకు మద్దతుగా నిలిచింది. ఢిల్లీ వరకు ఈ సమస్యను తీసుకెళ్లి వారికి న్యాయం చేయడానికి కృషి చేసింది.

ప్రభుత్వం ఏర్పడిన 100 రోజుల్లో నిరుద్యోగులకు న్యాయం చేస్తామని, ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న హామీని కాంగ్రెస్ మర్చిపోయింది. పేద, మధ్య తరగతి కుటుంబంలోని పిల్లలు చదువుకునే గురుకులాలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. ఫలితంగా వందల మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు, అవుతున్నారు. 56 మంది విద్యార్థులు మరణించారు. ఈ దారుణ పరిస్థితిని బీఆర్ఎస్ 'గురుకుల బాట' అనే కార్యక్రమం ద్వారా వెలుగులోకి తీసుకొచ్చింది. రాష్ట్రంలో రైతన్న పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. రైతు రుణమాఫీ, రైతు భరోసాను అరకొరగా చేసింది. బీఆర్ఎస్ ఒత్తిడి చేయడంతోనే ఆమాత్రమైనా చేసింది. తెలంగాణ కోసం ఉద్యమించిన బీఆర్ఎస్ ఆ తర్వాత రాష్ట్రాభివృద్ధికి పాటుపడింది. ఇప్పుడు ప్రభుత్వ వైఫల్యాను ఎండగడుతూ ప్రజా ప్రయోజనాల కోసం మరింత బలంగా పోరాడుతున్నది. ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకూ కాంగ్రెస్ ప్రభుత్వానికి నిద్ర లేకుండా చేస్తున్నది. ప్రస్తుత రాజకీయ పరిణామాల నేపథ్యంలో బీఆర్ఎస్ తిరిగి బలపడుతున్నది. ప్రజా సమస్యలను ఎత్తిచూపుతూ, ప్రభుత్వ వైఫల్యాలను నిరంతరం ప్రశ్నిస్తూ, ప్రజలకు అండగా నిలుస్తున్నది. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ ప్రజల మద్దతుతో మరింత బలంగా రాజకీయ వేదికపై నిలిచే అవకాశం ఉన్నది. తెలంగాణ ప్రజా హక్కుల కోసం, రైతుల కోసం, నిరుద్యోగుల కోసం, బడుగు వర్గాల కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తూనే ఉంది, ఉంటుంది.

-రాజేష్ నాయక్, 96035 79115

బహుజనులకు అండగా బీఆర్ఎస్

బీఆర్ఎస్‌ను భారత రాష్ట్ర సమితి అని కాకుండా బహుజన రాష్ట్ర సమితిగా పిలవాలని నాకు అనిపిస్తుంది. నిజానికి బీఆర్ఎస్‌ను అలా అనుకోవడానికి నాకు మాత్రమే కాదు, నాలాంటి బీసీ బిడ్డలందరికీ సరైన కారణాలు, ప్రాతిపదిక ఉంటాయని బలంగా నమ్ముతాను. కులగణన చుట్టూ అల్లుకున్న వివాదం, నాయకులు చేసుకుంటున్న విమర్శలను చూస్తున్న నాకు కొన్నేండ్ల క్రితం నాటి బీసీల సామాజిక, ఆర్థిక పరిస్థితి కండ్ల ముందు మెదిలింది.

ప్రపంచ బ్యాంకు సంస్కరణలను బలవంతంగా అమలుచేయాలనుకున్న కార్పొరేట్ జీతగాళ్ల కనిపించని కుట్రల ఫలితంగా అస్తిత్వాన్నే కోల్పోయే ప్రమాదంలోకి నెట్టివేయబడిన బీసీ కులాల దుస్థితి యాదికొచ్చింది. నా కాలేజీ రోజుల్లో పల్లెల్లో మార్మోగిన గోరటి వెంకన్న 'పల్లె కన్నీరు పెడుతుందో..' అన్న పాట యాదికి వస్తుంది. పీడితులు, తాడితుల పక్షాన నిలబడి వారి సమస్యల కోసం పోరాడటమే సామాజిక న్యాయం. ఏ కాలంలో అయినా, ఏ వ్యవస్థలోనైనా సామాజిక న్యాయానికి స్థూలంగా ఇదే నిర్వచనం.

డాక్టర్ మహేశ్ మాణిక్య ముదిరాజ్

సుపరిపాలన, స్వరాష్ట్ర సాధనే ధ్యేయంగా ఎగిసిపడి, అనుకున్న లక్ష్యాన్ని సాధించిన తెలంగాణ ఉద్యమానికి కూడా స్ఫూర్తి సామాజిక న్యాయమే. పాలనా పరమైన వివక్షను ఎదుర్కొని ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబడిన తెలంగాణ హక్కుల పరిరక్షణ కోసం గొంతెత్తి ఉద్యమించేందుకు ప్రత్యేక పార్టీగా పురుడుపోసుకున్న ఆనాటి టీఆర్ఎస్, ఈనాటి బీఆర్ఎస్ ప్రతీ సందర్భంలోనూ అన్యాయానికి బలయ్యే పీడితుల పక్షానే నిలబడింది. కలబడి కొట్లాడింది.

సమైక్య రాష్ట్రంలో అభివృద్ధి పరంగా వెనుకవేయబడ్డ తెలంగాణ కోసం ఓవైపు పోరాడుతూనే సామాజికంగా వెనుక వేయబడ్డ కులాలు, వర్గాల హక్కుల పరిరక్షణ కోసం గులాబీ పార్టీ ఉద్యమించింది. పార్టీ పెట్టిన ఒక్క సంవత్సర కాలంలో అంటే 2003లోనే కేసీఆర్ బహుజన, గిరిజన, మైనారిటీ, దళితుల సంక్షేమం, అభివృద్ధి కోసం ఆయా వర్గాల మేధావులు, పెద్దలతో సుదీర్ఘ సమావేశాలు జరిపి అందరి అభిప్రాయాలు తీసుకుని విప్లవాత్మకమైన విజన్ డాక్యుమెంట్ రూపొందించారు. దాంతోపాటే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తరువాత బీసీ కులాల సంక్షేమం, అభివృద్ధి కోసం ఉండాల్సిన బీసీ పాలసీని 2003 అక్టోబర్ 19 నాడే రూపొందించి దూరదృష్టి, దార్శనికత చాటుకున్నారు.

కేంద్ర ప్రభుత్వంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేసి వారి సంక్షేమం, అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలన్న డిమాండ్‌తో 2004లో కేంద్రమంత్రిగా ఉన్న కేసీఆర్ బీసీ నేతలతో వెళ్లి నాటి ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్‌తో చర్చించారు. తెలంగాణ ఉద్యమం ఊపందుకున్న తర్వాత కూడా అనేక సందర్భాల్లో బహుజన సంఘాలు, బీసీ మేధావులతో కలిసి బీఆర్ఎస్ ఉద్యమించింది. తెలంగాణ ఉద్యమ సమయంలోనే అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలు, ఆరాటాలను దగ్గర నుంచి చూసిన కేసీఆర్ స్వరాష్ట్రం ఏర్పడ్డాక బహుజనుల కోసం ఎన్నో వినూత్నమైన, విప్లవాత్మకమైన, సంక్షేమ, అభివృద్ధి పథకాలకు రూపకల్పన చేశారు. మంచిచెడులు ఎలా ఉన్నా భారతీయతతో పెనవేసుకుపోయిన కులాన్ని, దాని సంక్షేమాన్ని విస్మరిస్తే సమాజంపై అది దుష్ప్రభావాన్ని చూపిస్తుందని అంచనా వేసి, స్వరాష్ట్రంలో అలాంటి దుస్థితి రాకూడదన్న సదుద్దేశంతో బీసీ సంక్షేమం, అభివృద్ధి కోసం 2003లో తయారుచేసిన పాలసీని సీఎం అయ్యాక అమలు చేశారు. గొర్లు, బర్లు ఇచ్చి బీసీలను అవమానిస్తారా? అంటూ కొందరు అగ్రకుల పెత్తందారులు, ఇంకొందరు సూడో బీసీ నాయకులు చేసిన విమర్శలను పట్టించుకోకుండా బహుజనుల సంక్షేమం కోసం కేసీఆర్ పనిచేశారు. స్కిల్లింగ్, రీస్కిల్లింగ్, అప్ స్కిల్లింగ్ అన్న ఆధునిక ప్రపంచపు అభివృద్ధి సిద్ధాంతాన్ని బీసీ బిడ్డలు సైతం అందిపుచ్చుకోవాలనుకున్నారు. శతాబ్దాలుగా భారతీయ సమాజంలో అంతర్గతంగా ఉండిపోయిన అద్భుతమైన కులవృత్తి నైపుణ్యాలను వృథాగా ఎందుకు పోనిచ్చాలన్న ఉద్దేశంతో బహుజనులు వృత్తి నైపుణ్యానికి మరింత పదును పెట్టేందుకు ప్రభుత్వ పరంగా ప్రత్యేక పథకాలతో సాయం అందించారు.

కేసీఆర్ ప్రారంభించిన ప్రతి సంక్షేమ పథకం వెనక మాడ్రన్ ఇండస్ట్రియలైజేషన్ డెవలప్‌మెంట్ (ఆధునిక పారిశ్రామికీకరణ అభివృద్ధి నమూనా) కాన్సెప్ట్ ఉన్నది. కులవృత్తులు చేసుకునే బీసీలు ఆధునిక పోకడలను అందిపుచ్చుకుని యాంత్రీకరణ, మార్కెటైజేషన్ వైపు సాగాలన్న ఉదాత్తమైన ఆలోచన, ముందుచూపు ఉన్నది. అందుకే పద్మశాలీలకు మరమగ్గాలిచ్చి ధోతులు మాత్రమే తయారు చేసుకోమని చెప్పి చేతులు దులుపుకోకుండా మార్కెట్ అవసరాలకు తగినట్టుగా పట్టు చీరలను తయారు చేసేలా వారి నైపుణ్యానికి పదును పెట్టేలా లూమ్ మాడ్రనైజేషన్‌తో ప్రయత్నం చేశారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా బతకడమే దినదినగండంగా సాగిన నేతన్నల జీవికకు ఓ దిక్కు సంక్షేమ కార్యక్రమాలను అందిస్తూనే ఆదాయం సంపాదించుకునేలా వాళ్లను మార్కెట్‌తో కనెక్ట్ చేశారు. గౌడ సోదరులు వారికి అనువైన స్థలాల్లో ఈతవనాలను పెంచుకునేందుకు అనుమతినిచ్చి కేసీఆర్ ప్రభుత్వం కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టింది. చెట్ల పన్నుఎత్తేసింది. పాత బకాయిలను రద్దు చేసింది. పెన్షన్లను ఇచ్చి ఆసరా అయింది. నీరా పాలసీతో గౌడ సోదరులకు గౌరవాన్ని ఇచ్చింది.

ఇక, గంగపుత్రులు, ముదిరాజుల కోసం కూడా కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారు. చేప పిల్లలను ఇవ్వడమే కాదు వారికి మార్కెటింగ్ సదుపాయాన్ని కూడా కల్పించారు. మిషన్ కాకతీయతో చెరువులకు జల కళ తీసుకొచ్చి గంగపుత్రుల జీవనాధారానికి తిరుగులేని భరోసా ఇచ్చారు. అలాగే, యాదవ సోదరులకు గొర్రెలు ఇచ్చి వారి సంక్షేమానికి కేసీఆర్ పెద్దపీట వేశారు. ఆయన సీఎంగా ఉన్న కాలంలో దాదాపు 8 వేల కోట్ల రూపాయల పశు సంపదను సృష్టించారు. మాంసం ఉత్పత్తిలో మన రాష్ట్రం స్వయం సమృద్ధి సాధించడంతో పాటు గ్రామీణ వ్యవస్థ బలోపేతమైంది. ఇతర రాష్ట్రాలు కూడా తెలంగాణను ఆదర్శంగా తీసుకుని తమ ప్రాంతాల్లో ఈ పథకాన్ని అమలుచేశాయి. రజకుల కోసం ధోబీ ఘాట్లను విరివిరిగా నిర్మించారు.

ఓ వైపు అంతరించే దశలో ఉన్న బహుజనుల కులవృత్తులకు తిరిగి ప్రాణం పోసిన కేసీఆర్ బీసీలను రాజకీయంగా ఎంతో ప్రోత్సహించారు. 2003లో తీసుకున్న విధాన నిర్ణయాలకు అనుగుణంగా స్థానిక సంస్థల నుంచి అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల దాకా బడుగులకు గొడుగు పట్టారు. తెలంగాణ తొలి శాసనమండలి చైర్మన్‌గా స్వామిగౌడ్, శాసనసభ స్పీకర్‌గా సిరికొండ మధుసూదనాచారికి అవకాశం కల్పించారు. మధుసూదనాచారి ప్రస్తుతం శాసనమండలిలో ప్రతిపక్ష నేతగా కొనసాగుతున్నారు. బండా ప్రకాశ్ ముదిరాజ్ శాసనమండలి వైస్ చైర్మన్‌గా, ఇంకా ఎంతోమంది బీసీ నేతలను వ్యవసాయ మార్కెట్ కమిటీలు, దేవాదాయ కమిటీల్లోనే కాకుండా రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్లు, స్థానిక సంస్థల సారథులు, సభ్యులుగా కేసీఆర్ నియమించారు. రాజకీయంగా బీసీలకు ఇంత విస్తృతంగా అవకాశాలను ఇచ్చింది బీఆర్ఎస్ ఒక్కటే.

కేసీఆర్ కృషి పట్టుదలతో ఒకప్పుడు ఆత్మహత్యలే శరణ్యమని భావించిన పద్మశాలీలు అద్భుతమైన కళా నైపుణ్యానికి కేరాఫ్ అడ్రస్‌గా మారారు. తెలంగాణ ముదిరాజ్‌లు, యాదవులు తమ కులవృత్తితో దేశంలోనే ఒక ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్నారు. తెలంగాణలోని బహుజనులను ఆర్థికంగా సంపన్నులను చూసి వారి పట్ల ఉన్న సామాజిక వివక్షను తొలగించి కుల రహిత సమాజానికి కేసీఆర్ బీజం వేశారు. అధికారంలో ఉన్నా, లేకున్నా బహుజనులను బీఆర్ఎస్ ఎప్పుడూ ఓటు బ్యాంకుగా చూడలేదు. వారితో ఓట్ల రాజకీయాలు చేయలేదు. వారికి ఏదైనా సమస్య ఉంటే పరిష్కారం కోసం కదం తొక్కింది. పిడికిలి బిగించింది. ఉద్యమించింది. బహుజనులకు అండగా నిలిచింది. అందుకే భారత రాష్ట్ర సమితిని బహుజన రాష్ట్ర సమితి అని పిలవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

బీసీ డిక్లరేషన్ పేరుతో బహుజనుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, ఇచ్చిన ప్రతి హామీని తుంగలో తొక్కి, ఇస్తామన్న రిజర్వేషన్లకు అసెంబ్లీ సాక్షిగా మంగళం పాడింది. చట్టం తీసుకువచ్చి మరీ బీసీలకు 42 శాతం ప్రాతినిధ్యం ఇస్తామని, కుల గణన పేరుతో ఉన్న ప్రాతినిధ్యాన్నే ప్రమాదంలోకి నెట్టింది. ఈ సందర్భంలో భవిష్యత్తుపైన ఆందోళనలో ఉన్న బీసీలంతా భారత రాష్ట్ర సమితితో కలిసి కదం తొక్కేందుకు సిద్ధంగా ఉన్నారు.

కేసీఆర్ ప్రారంభించిన ప్రతి సంక్షేమ పథకం వెనక మాడ్రన్ ఇండస్ట్రియలైజేషన్ డెవలప్‌మెంట్ (ఆధునిక పారిశ్రామికీకరణ అభివృద్ధి నమూనా) కాన్సెప్ట్ ఉన్నది. కులవృత్తులు చేసుకునే బీసీలు ఆధునిక పోకడలను అందిపుచ్చుకుని యాంత్రీకరణ, మార్కెటైజేషన్ వైపు సాగాలన్న ఉదాత్తమైన ఆలోచన, ముందుచూపు ఉన్నది. అందుకే పద్మశాలీలకు మరమగ్గాలిచ్చి ధోతులు మాత్రమే తయారు చేసుకోమని చెప్పి చేతులు దులుపుకోకుండా మార్కెట్ అవసరాలకు తగినట్టుగా పట్టు చీరలను తయారు చేసేలా వారి నైపుణ్యానికి పదును పెట్టేలా లూమ్ మాడ్రనైజేషన్‌తో ప్రయత్నం చేశారు.

ద్రవిడ సామాజిక బహుజన జీవనంతో ఉత్పత్తి కులాల సంస్కృతి, ద్రవిడ సంస్కృతి బలంగా ముడిపడి ఉన్నాయి. పెరియార్ రామస్వామి దగ్గరి నుంచి, ఎంజీఆర్, కరుణానిధి, స్టాలిన్ వరకు కొనసాగుతున్న రాజకీయ అస్తిత్వమంతా ద్రవిడ స్వీయ రాజకీయ అస్తిత్వంగా నిలబడింది. అట్టడుగు వర్గాల ఉత్పత్తి కులాల పక్షాన నిలిచిన డీఎంకే తమిళనాడులో తిరుగులేని శక్తిగా మారింది. తమిళనాట 57 ఏండ్లుగా వారి ప్రాంతీయ అస్తిత్వమే బహుజన రాజకీయ అస్తిత్వంగా గెలుస్తూ వస్తున్నది. కాంగ్రెస్ బీజేపీ లాంటి పార్టీలు తమిళనేలపై ఇప్పటికీ అడుగుపెట్టలేకపోతున్నాయి. భాషకు జాతికి అవినాభావ సంబంధం ఉందంటారు.

ఉత్పత్తి కులాలే ఊపిరిగా..

జూలూరు గౌరీశంకర్

పెరియార్ కంటే ముందు తమిళనాడులో అయోధ్యదాస్, కేరళలో నారాయణ గురు పందొమ్మిదో శతాబ్దంలోనే ఉత్పత్తి కులాల ఉద్యమాలకు శ్రీకారం చుట్టారు. మహారాష్ట్రలో పూలే స్ఫూర్తి కూడా దక్షిణాదిపై పడింది. తమిళనాడు మాదిరిగానే తెలంగాణలో కూడా ఉత్పత్తి కులాల సంస్కృతి బలంగా ఉన్నది. తెలంగాణకు నీళ్లు, నిధులు నియామకాలు, స్వపరిపాలన దృక్కోణం నుంచి తెలంగాణ స్వీయరాజకీయ అస్తిత్వం స్వరాష్ట్ర ఉద్యమంగా ఎగసిపడింది. సహజంగానే తెలంగాణ నేలలో పోరాట వారసత్వం ఉన్నది. అదంతా ఉత్పత్తి కులాల నుంచి వచ్చినదేనన్నది స్పష్టం. అది వీరతెలంగాణ సాయుధ పోరాటమైనా, అది వేరు తెలంగాణ స్వరాష్ట్ర పోరాటమైనా.

ఉత్పత్తి కులాలు, సబ్బండ వర్ణాలు ఇందులో క్రియాశీల, త్యాగశీల పాత్ర పోషించాయి. ప్రపంచీకరణ తెరలను చీల్చుకుని జరిగిన పద్నాలుగేండ్ల ఉద్యమం ఉద్యమాల చరిత్రలో అసాధారణమైనది. దేశవ్యాప్తంగా ఈ ఉద్యమానికి మద్దతు కూడగట్టడంలో కేంద్రంపై అలుపెరుగని పోరాటం చేయడంలో బీఆర్ఎస్ కృషి అజరామరం. తెలంగాణలోని ఉత్పత్తి కులాలను, సబ్బండవర్ణాలను ఒక్కతాటిపై తెచ్చిన ఘనత తెలంగాణ స్వరాష్ట్ర ఉద్యమానికే దక్కుతుంది. కేసీఆర్ మొండితనం, అలుపెరుగని దీక్ష ఉద్యమాన్ని విజయతీరాలకు చేర్చింది. ఉత్పత్తి కులాలు, సబ్బండవర్ణాలను ఏకంచేసి ఒక్కతాటిపైకి తెచ్చే క్రమాన్ని కేసీఆర్ రాజకీయ ప్రక్రియ ద్వారా ఒడుపుగా పట్టుకుని తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారు. ఇది తెలంగాణ చరిత్ర. రాష్ట్ర అవతరణ తర్వాత పునర్నిర్మాణానికి దారులు వేగంగా పడ్డాయి. స్వపరిపాలన విషయంలో సమాజంలో సగభాగమైన బీసీలకు అన్నిరంగాల్లో దక్కాల్సిన వాటాల ఖాళీలను పూరించవలసి ఉన్నది. స్థానిక సంస్థల నుంచి అసెంబ్లీ వరకు బీసీలకు చట్టబద్ధంగా రిజర్వేషన్లు లేవు. ఈ దేశంలో, ఈ రాష్ట్రంలోని బీసీల జీవన్మరణ సమస్య 77 ఏండ్లుగా కొనసాగుతూనే ఉన్నది. తెలంగాణ స్వీయ రాజకీయ అస్తిత్వమంటే అది తెలంగాణ బహుజన స్వీయ రాజకీయ అస్తిత్వంగా మారవలసి ఉంది. బీఆర్ఎస్ ఈ చారిత్రక కర్తవ్యాన్ని నెరవేర్చే బాధ్యతను భుజం మీద వేసుకోవాలి. అందుకు తమిళనాడును ప్రతీకగా తీసుకోవాలి. బడుగులకు అందాల్సిన ఫలాలన్నీ అందించే కృషి జరగాలి.

తెలంగాణ స్వీయ రాజకీయ అస్తిత్వమే మనమూల భాషల్ని, మూల సంస్కృతుల్ని, ఉత్పత్తికులాల సంస్కృతిని కాపాడుతుంది. గ్రామదేవతల సంస్కృతి నుంచి వచ్చిన సామాజిక ఐక్యత, గంగాజమున తెహజీబ్ సంస్కృతి ఈ నేలపైన చిరస్థాయిగా నిలిచిపోవాలంటే తెలంగాణ బహుజన స్వీయ రాజకీయ అస్తిత్వం చెరిగిపోకుండా కాపాడుకోవాలి. ఈ మహా సంకల్పాన్ని బహుజనుల చేతుల మీదుగా నడిపించే శక్తి తెలంగాణను సాధించిన స్వీయ రాజకీయ పార్టీకే ఉంటుంది. కాంగ్రెస్, బీజేపీ లాంటి పార్టీలకు ఉండదు. ఉత్పత్తి కులాలను, ఉత్పత్తి కులాల పునాదులైన బీసీలను, దళిత ఆదివాసీ మైనార్టీలను కలుపుకొని తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడుకోవాలి. ఆ దిశగా బహుజన నాయకత్వం పెరగవలసి ఉంది.

ఇప్పుడు తెలంగాణలో రావాల్సిన మార్పు అంటే అది ఉత్పత్తి కులాల బహుజన సాధికారితనే చెప్పాలి. దీనికి స్థానిక సంస్థల నుంచి అసెంబ్లీ, పార్లమెంటు వరకు రాజ్యాధికారంలో వీరి వాటా వీరికి దక్కి తీరాలి. తెలంగాణ రాష్ట్రసాధన ఉద్యమంలాగా ఇది నిరంతర ఉద్యమంగా సాగాలి. ఇదే బీఆర్ఎస్‌కు బలంగా మారి దేశంలో ప్రాంతీయ అస్తిత్వాలను కలుపుకొని పోయే శక్తిగా నిలుస్తుంది. ఆధిపత్య వర్గాలు అధికారం పొందడం కోసం తిమ్మిని బమ్మి చేసే ఎన్నికల సందర్భాలను చూడడం విచారకరం. తెలంగాణలో ఇంకా కిర్రుచెప్పుల బుర్రమీసాల పెత్తందాలీతనాలు తమ అధికారాన్ని చెలాయించే స్థితి నుంచి రాజకీయాలు తెలంగాణ బహుజన స్వీయ రాజకీయ అస్తిత్వం వైపునకు మళ్లాలి.

తెలంగాణ సమాజాన్ని అధికారం కోసం తమ ఆధిపత్య పెత్తనాల కోసం సమాజ విభజనలకు దారితీసే వి